వెంటనే పారవెయ్యవచ్చు, లేదా యెవరికేనా బహూకరించవచ్చు; ఐనప్పటికీ మీ హస్తాలు దాన్ని ముట్టినవనే విషయమొక్కటే నన్నానంద పరుస్తుంది.

"నామీద ఆగ్రహించవద్దని మిమ్మల్ని ప్రార్థిస్తున్నాను. ఏడు సంవత్సరాలక్రితం, మీ రింకా కన్యగావున్నప్పుడు, నేను వ్రాసిన ఆవేశపూరితమైన, బుద్ధిహీనములైన లేఖలు, వాటికి జవాబులాసించటం తలచుకున్నప్పుడల్లా నేను లజ్జతో కుంగిపోతున్నాను. ఇప్పుడునాలో మిగిలిందంతా గౌరవం, ఆనంతమైన భక్తి, బానిసకున్నంత విశ్వాసం. నేనిప్పుడు చెయ్యగలిగిందంతా మీ జీవిత ప్రతిక్షణమూ ఆనంద పూరితంగా వుండాలని కోరటం, మీ ఆనందాన్ని చూచి నేనానందించటం. మానసికంగా మీరాశీనులైన ఆసనాల ముందు, నేను మోకరిల్లుతున్నాను. చేతనాచేతన వస్తువులు వేటిమీదా నాకు యీర్ష్యకూడా లేదు మరొక్కసారి పెద్ద అనాహూతమైన లేఖ వ్రాసినందుకు మీక్షమ వేడుకొంటున్నాను.

మరణంవరకూ,మరణానంతరం మీసేవకుడైన,

జి. యన్. జెడ్. హెచ్."

ఈ ఉత్తరం నేను వాస్యాకు చూపించాలా అక్కరలేదా? ఎప్పుడు చూపించాలి? ఇప్పుడా లేక అతిధులంతా వెళ్లిపోయింతర్వాతనా? తర్వాతే చెబుదాం. ఇప్పుడైతే యీ దురదృష్టవంతుడేకాక, అతనితోపాటు నేనుకూడా హాస్యాస్పదురాలనౌతాను."

అని ఆలోచిస్తున్న వెరా, ఆ అయిదు మణుల్లోంచి ప్రజ్వరిల్లుతున్న రక్తారుణచ్ఛాయలమీద నుండి దృష్టి మరల్చలేకపోయింది.

(తరువాయి వచ్చే సంచికలో)

స్కెచ్

# అందం చెడిన కథాంతం

కె. రామలక్ష్మి

ఆత్రుత కంఠస్వరాన్ని తొణికిస్తూంటే "మీ అమ్మాయిని వివాహం చేసుకోవాలని వుంది" అన్నాడు చిత్రకారుడు. "నేనో పేద చిత్రకారుణ్ణి. నెలకో వందరూపాయిలు/ సంపాదించుకుంటున్నాను. ఆ అమ్మాయి ఓ కోటీశ్వరుడి కూతురు. ఇలా అడుగుతూంటే మీకు ఆశ్చర్యంగా తోస్తోందేమో" అన్నాడు జంకుతూనే. చిత్రకారుడలా అనుకున్నాడే కాని దానయ్య చెట్టి ముఖ కవళికల్లో అయిష్టత కనిపించలేదు. సరికదా చెట్టిగారు లోపల్లోపల సంతోషించాడు. నెలకి వందరూపాయిలు సంపాదించే అల్లుడేనా దొరికినందుకు. అతని వ్యాపారం అంతా అనుకోని ఓ ఉపద్రవానికీ ఓ ప్రమాదానికీ దారితీస్తోంది. దానిలోంచి డబ్బుతోటీ పలుబడితోటీ బయటపడతాననే నమ్మకంలేదు చెట్టికి. ఈమధ్య వ్యాపారం నీరసించి దేన్లోనూ లాభం రాలేదు. కొత్తరకం "చోడిపిండి"డబ్బాలకెత్తించి వ్యాపారంలో దింపాడు. దానిమీద ప్రకటనలకి ఎంతోడబ్బు కర్చుచేశాడు. అందరూ అన్నీ కొనుకున్నారు కాని, దానయ్యచెట్టి కొత్తరకం "చోడిపిండి" మీద ఎవరిదృష్టీ పడలేదు.

"నాకూతురే ఓ బీదవాడికూతురైతే పెళ్లాడతాననే వాడివా?" ప్రశ్నించాడు కుబేరుడిలాంటి చెట్టి.

"తప్పకుండాను"అన్నాడు, చాలా నేర్పుతో అయిష్టతని కనబరచకుండా. ఫలితాలు చూస్తే, చిత్రకారుడి తల తిరిగింది. చెట్టి పిల్లని పెళ్ళి చేసుకుందుకు ఒప్పుకోడమే కాకుండా, చాలా త్వరలోనే పెళ్ళి చేస్తానన్నాడు.

"నా ఆనందం ఎలా తెలియబరచడమో తెలియకుండా వుంది" అన్నాడు చిత్రకారుడు. హృదయాంతరాల్లోంచి ఉప్పెనలా పొంగుతోంది కృతజ్ఞతాభావం. "తల్చుకుంటే, సింహానికి చిట్టెలుక సాయంచేస్తానన్నట్లుంది'' అన్నాడు ఇంకా తడబడుతూనే.

"అదేంకాదులే. ఎలాగేనా ప్రజల్చేత నాపిండి కొనిపించేలా చెయ్యకలిగితే చెయ్యి. అదే చెయ్యకలిగితే, నా ఏజెంట్లువరూ చెయ్యలేంది నువ్వు చేసినవాడవవుతావు."

"దాని పేరు మార్చేసెయాలి." ఆలోచనతో

అన్నాడు చిత్రకారుడు. "ప్రకటన విషయంలో మార్పు తెద్దాం-నాకో ఆలోచన తడుతోంది"

మూడు వారాలు గడిచాయి. ఓ సుప్రభాతాన్ని కొత్తరకం ఆహారపదార్థంరాక-ప్రపంచానికి గోడలమీది ప్రకటనలద్వారా తెలిసింది. లేత వెన్నెలలూ, తొలివలపులూ, సాటిరాని మృదువైన పిండి—అది. పేరులోనే ప్రతిధ్వనిస్తోంది దాని ఘనత. చిత్రకారుడు బలసిన పాపాయిలనీ వ్యాపారస్తుల ఫొటోనీ చిత్రించలేదు. పెద్దచిత్రం. విషాదపూరిత వాతావరణంతో చిత్రించబడిన—నరకం అదే పతితులుండే నరకం. అక్కడి యమయాతనలకితోడు వారు యింకోకొత్తబాధ పడుతున్నట్లు చిత్రించాడు. లేత వెన్నెలలూ తొలివలపులూ సాటిరాని మృదువైన యీ పిండిని, అందమైన పాత్రలలో పతితులకు అందీఅందనట్లు పట్టుకునివున్నారు యమభటులు. ఆ బొమ్మల్లో ఘనతవహించిన స్త్రీ పురుషుల పోలికలూ, రాజకీయ నాయకుల ముఖకవళికలూ, తెరవెనుకనుంచి కనిపించినట్లు కనిపిస్తున్నాయి. అంతేకాదు ఆ బాధితుల సమూహంలో రచయితలూ, చిత్రకారులూ, సినిమాప్రజా, అందరూ వున్నట్టేవుంది చూపరులకి కాని అందరికళ్ళకీ బాగా ఆనేలా—ఒకేఒక పంక్తిలో రాసివుంది, "వారికి యిక లభియించదు."

ఆనందంకోసంకన్నా ఏదోపనిగా ప్రజలు తమతమ పనులని చేస్తారనేది గ్రహించాడు చిత్రకారుడు. హటాత్తుగా, సారాయికొట్లో కనిపిస్తే డాక్టరు కొంచం పుచ్చుకోమన్నాడనీ, లేకుంటే తనకీ అలవాటే లేదని, మనం అడక్కుండానే విశదపరిచేవారు వందలాది వుంటారు మన మధ్యతరగతిలో. అంతేకాదు, అలాగే రజకార్లూ గుండాలూ చెలరేగి ప్రతి అమాయకుల్నికూడా కనికరంలేకుండాచంపేస్తున్నారంటే, వాడికీ ఏదోకారణం గోచరిస్తుందేకాని, ఇంకోళ్లని చంపటం కొందరికి సరదానిస్తుందేమో అని ఎవరికీ తోచదు. అలాగే జరిగింది యీ ప్రకటనలో. చోడిపిండి ఆనందంగా ఎవరూ ఆరగించరు. కాని, యీ విపరీతమైన ప్రకటనాపద్ధతి, ఇంటి ఇల్లాళ్లని పిచ్చెత్తించింది. అందరూ దాన్నే కొండం మొదలెట్టారు. హోటళ్ళలోకూడా ఏదో విధంగా దాన్ని సరఫరాచేస్తున్నారు. రకరకాల వంటకాలరూపంతో. స్త్రీలు యింట్లోవాళ్ళచేత బలవంతంగానయినా దాన్ని తినిపించసాగారు. "అయ్యో తినకుండా వెళ్ళిపోతున్నారు" అంటుంది తాలూకా ఆఫీసు గుమాస్తా భార్య, నీరసంగా ఆఫీసుకిబయలుదేరిన భర్తతో. అంతే, సాయంత్రం యింటికివస్తే, పొద్దుట తిననిదానికి ప్రాయశ్చిత్తంగా, పుచ్చుకుంటాడు. బిస్కట్లరూపంలో నవనాగరికులూ, రొట్టెరూపంలో వయసుమళ్ళినవాళ్ళూ, జావరూపులో ముదుసలులూ అందరూ, బలవంతానైనా తినసాగారు. యీ ఆఘాయిత్యాన్ని చూసిచూసి, రక్షణశాఖామంత్రి, సెలవిచ్చారు. "శిక్షణ ఫలవంతం కావాలంటే, ఎవరంతటవారు—ఎన్నుకోవాలి." అంటే ఆయన వుద్దేశం, జబ్బుచేసినా, (ఎక్కువ తిండం మూలాన్ని) అతి ఆరోగ్యంగాతయారయినా, ప్రభుత్వబాధ్యత లేదని కాబోలు.

అంతే, తొలివలపులూ, లేత వెన్నెలలూ సాటిరాని యీపిండి ఎంకిలా ఇంటింటా వెలిసింది. కాని, దానయ్యచెట్టికి తోచింది. యీ ఉప్పెన యిప్పుడేకాకపోయినా, త్వరలోనే సమసిపోతుందని. అందుకే, అదనుచూచుకుని సరియైన సమయంలో, యీ ఆహారపదార్థంమీద హక్కువదులుకుని యింకోడికి అమ్మేశాడు. దాంతో, అతని ధనమూ, గౌరవమూకూడా, శాశ్వతంగా రక్షింపబడ్డాయి. చెట్టిగారికూతురు నిజంగా కుబేరుడికూతురైంది. దాంతో నెలకి వందరూపాయిలు సంపాదించుకునే చిత్రకారుడికంటె, ఉన్నత అంతస్థులో వాడే అల్లుడయ్యే అవకాశం లభించింది. అతితెలివి ప్రదర్శించిన చిట్టెలుకలాంటి చిత్రకారుడు, ధనవంతుడైన దానయ్య సింహానికి యింత సహాయం చేసినందుకు తరువాత చాలా విచారించాడు. ఏ ముహూర్తంలో చేశాడో ఆ ప్రకటనచిత్రం. ఆ అద్భుత ఫలితాన్నిచ్చిన —నరక చిత్రం—అప్పుడే తనదారి తనకి ఏర్పడింది. నెలకి వందరూపాయిలూ, అర్థాకలికడుపూఅంతేకానిదండిదానయ్య చెట్టికూతురిని చేపట్టే అదృష్టం చెయ్యిజారింది.

"ఏం చేస్తాంలే; మానవమాత్రులు జయాపజయాలకి అతీతులు. తృప్తిపడు" అన్నాడు. హోటలుకి టీతాగడానికి వచ్చిన చిత్రకారుడితో ఓ వేదాంతిలాంటి కవి!